# పున్నాగ

మాఆవిణ్ని రైలెక్కించి యింటికొచ్చాను. ఇల్లంతా బావురుమని నన్నుచూసింది. మరోవ్యక్తి తోడుగాలేని ఈ యింట్లో, ఎంతలేదన్నా మూడునాలుగు నెలలయినా నేను గడపాలి. అది ఈపాటికి కొలకలూరు దాటేవుండొచ్చు. మరో మూడున్నరగంటల తదనంతరం, హాయిగా వాళ్ళఊరు చేరుకొంటుంది. పుట్టిల్లుగనక దానికక్కడ కాలక్షేపానికేమాత్రం లోటుజరగదు. ఎటుగూడీ యిబ్బంది పడవలసిందల్లా నేనే! మాఆవిడకు నెలతప్పటమనేది నాకు సంతోషకరమయిన విషయమే! కానీ ఈవంకతో ఆవిడ నెలలలెఖ్ఖలో పుట్టింట బిచాణా పరచటం నేను మెచ్చుకోలేను. ఏది ఏమైనప్పటికీ అది వెళ్ళిపోయింది. దాన్నిపోకుండా చెయ్యాలన్న నాప్రయత్నాలన్నీ వీగిపోయినాయి. మునుముందు పుట్టిన ఆడబిడ్డ నా యింట్లోనే మొదటిపురుడు పోసుకోవాలని మా మామ పట్టుపట్టటంవల్ల తప్పించుకోలేక పోయినాను. అందులో మాయింటిదానికి గూడా కొంత 'రిలీఫ్' అవసరమని తోచింది గావును—తన తండ్రి వాదాన్ని బలపరిచి, ఆయనతో బాటే ప్రయాణమైంది.

శ్రీమతి తిరిగి వొచ్చిందాకా, కాలం ఎట్లా గడపాలా అన్నదే నాకు ముఖ్యమైనప్రశ్న. కాస్తోకూస్తో కొం[illegible]వున్నది. దాని మక్తాడబ్బుతో జీవితం హాయిగా గడుస్తుంది. ఎముకలు విరుచుకొనవలసిన అవసరం లేదు. కాలక్షేపానికి రకరకాల మార్గాలు తోచాయి. కానీ అవేవీ నాకంతగా నచ్చలేదు.

వాటివల్ల ఏదోవిధంగా కాలక్షేపం జరగకపోదు కానీ, అంత కంటే హుషారుగా కాలం గడపగలందుకు కేదన్నా వుంటుం దేమోననే దురాశ నన్ను విడవకపోవటంచేత నాలుగైదు రోజులదాకా ఒకనిర్ణయానికి రాలేకపోయినాను.

అదృష్టవశాత్తూ, ఈ స్తంభిత వాతావరణంలో నేనెక్కు వకాలం వుండనవసరం లేకపోయింది. అవ్వేళ మధ్యాహ్నం సిగ రెట్టు కాలుస్తుండగా బ్రహ్మాండమైన, మహత్తరమైన, ఆలో చన నాబుర్రలో 'ఠక్కీ'మని మెరిసింది. గబగబా ఉత్తరాలన్నీ దుమ్ముదులిపి చదవసాగాను. చలపతి రాసిన ఉత్తరం, ఎక్కువ శ్రమపడకుండానే దొరికింది. దాన్ని వాడు రాసి నాలుగునెలలు దాటిపోయింది. ఇంతకాలమూ, వాడా సమస్యను విడగొట్టు కొన్నాడో, లేక దానితోనే సతమత మవుతున్నాడో నాకు తెలీదు. వాడొక అపురూప సుందరిని పెళ్ళి చేసుకొన్నాడుట. ఆపెళ్ళి చాలా విచిత్రంగానూ, ఎవ్వరూ అనుకోని విధంగానూ జరిగిందట. వాళ్ళిద్దరూ పరస్పరం ప్రేమించుకొనే ఆపెళ్ళి చేసు కొన్నారుట. కానీ పెళ్ళివల్ల 'నాకు పిచ్చెక్కే పరిస్థితి దాపు రించింద'దని చలపతి రాశాడు. ఇంతకాలమూ నేనా విష యాన్ని ఖాతరుచెయ్యనిమాట నిజం! మాఆవిడ పుట్టింటికి వెళ్ళకపోతే, ఈనాటికీ నేను చలపతి విషయం పట్టించుకొనే వాణ్ణిగాదు. లోకంలో అనేకవందల మందికి, అనేకవందల సమస్యలు ఈవివాహాలవలన కలుగుతున్నాయి. వాటన్నిటినీ తీర్చటమే నాడ్యూటీ కాదుగదా!

కానీ ఇక్కడి సందర్భంవేరు. ఈ వుత్తరాన్ని పురస్క రించుకొని, నేను చలపతిదగ్గరకు వెళ్ళటం చాలా ఉత్తమమని

పించింది. వాడెంతో మథనపడిన తరవాత గానీ, ఈ ఉత్తరం రాసివుండడు. నేను వెళ్ళి ఆ 'మథన' ఏమిటో, అదెందుకు వొచ్చిందో, దానినుండి తప్పుకోటానికి తోవ లేమున్నాయో సమగ్రంగా వాడికి చెప్పవొచ్చు. నా ఈ ప్రయత్నాలవల్ల వాడికి మేలుకలుగుతుందో, లేదో నేను చెప్పలేను. ఐనా ఆ విషయం బొత్తిగా నా కనవసరం. వాడి సమస్యాలూ, వాడూ కట్టగట్టుకొని ఏగంగలో దూకినా నా కభ్యంతరంలేదు. నాకు కావలసినదల్లా కాలక్షేపం. కేవలం కాలక్షేపం. ఈదృష్టితోనే, ఆ తెల్లవారి ఉదయమే ప్రయాణమయ్యాను. దోవలో వివిధ అనుమానాలు, జలగల్లాగా నన్ను పట్టుకొని వేధించాయి. నిజంగా నేనిప్పుడు వెళ్ళటం అనవసరమేమో? ఇంతకాలందాకా వాడా గొడవలతోనే సతమత మవుతుంటాడ నేందుకు ఆధార మేమిటి? నావంటివాళ్ళే, వాడి కితర స్నేహితులు వుండివుండొచ్చు. వాళ్ళకూ ఈవిధంగానే ఉత్తరాలు రాయటమూ, వాళ్ళువొచ్చి, ఆసమస్యను బదాబదలు చెయ్యటమూ, ఇప్పటికే జరిగి ఉన్నపక్షంలో ఈ నా ప్రయాణమంతా శుష్కదండుగ ఐనా ఫర్వాలేదు. కొంతలోకొంతైనా అసలు సంగతేమిటో తెలిసిపోతుంది. కొన్ని రోజులపాటైనా సత్కాలక్షేప మవుతుంది.

నన్ను చూడంగానే చలపతి విపరీతమైన ఆనందాన్ని ప్రకటించాడు.

'ఒచ్చావా వొచ్చావా' అనే మాటలుగూడా సరిగ్గా అనలేకపోయినాడు. నా రాకవల్ల వాడుపొందిన సంతోషం చూస్తే వాడింకా ఆ వెధవ పీకులాటతో గిజగిజలాడుతూనే

ఉన్నాడని నేను గ్రహించాను. వాడింటికి లోగడ ఒక్కసారైనా నేను రాలేదు. వాడూనేనూ, అయిదేళ్ళ క్రిందట ఒక్కే కాలేజీలో చదువుకొన్నాము. ఒకేగదిలో ఉన్నాము. వాడు దరిద్రుడు కానిమాట వాస్తవమేగానీ, పుష్కలంగా డబ్బు ఉన్నమాట మాత్రం అబద్ధం.

భోజనాలప్పుడు వాడిభార్యను చూడటం తటస్థపడ్డది. ఆమె అందగత్తె. అంతకుదప్ప ఎవ్వరూ, ఆమెనుగురించి ఎక్కువ చెప్పలేదు. ఆ పిల్లవలన వీడు పడుతున్న బాధ లేమిటో నాకు అర్థంకాలేదు. ఒకటిరెండుసార్లు ఆపిల్లను పరీక్షగా చూశాను. కాలి చిటికెనవ్రేళ్ళు భూమి నానుతున్నయ్యో లేదో పరిశీలించాను. నడిచేప్పుడు యేమన్నా శబ్దం అవుతున్నదేమో విన్నాను. పెమ్యనాకుడులాంటి వక్ర చిహ్నాలకోసం కూడా ప్రయత్నించాను. అల్లాంటివేమీ నాకు కనిపించలేదు.

భోజనానంతరం వసారా గదిలో నాకమర్చిన మంచం మీద నడుంవాల్చాను. కంటికి నిద్ర రావటల్లేదు. కానీ క్షణక్షణమూ ఆవిడరూపం నాకళ్ళల్లోకి రాసాగింది. ఆమె, అంత అందాన్నీ స్వాధీనపరచుకొన్న చలపతిమీద నాకు అసూయ కల్గుతున్నది. వాడూ, ఆమే, కలిసి ఉన్నట్లూహించుకొని, ఉత్తేజితుణ్నయ్యాను. ఆమెప్రక్క, నన్ను నేనూహించుకొని కలలుకన్నాను. ఆమే నాభార్యఐవుంటే, నాజీవనం ఎట్లాఉంట్టుందోనని ఆలోచించాను. అటువంటి సుందరాంగిని పొందనిజన్మ జన్మేకాదని రూఢీపడ్డాను. కానీ, కానీ, చలపతి నామిత్రుడు, అతనేవేవో ఇబ్బందులలో వుండి నా సహాయం అర్థించాడు, వాటిని పరిష్కరించాలనే నిజమైన ఇచ్ఛ నాకు లేకపోవచ్చు.

పరిష్కరణకు ఏప్రయత్నమూ చేయకపోవొచ్చు. కానీ వాణ్ణి మరింత మనస్తాపానికి గురిచెయ్యటం భావ్యంగాదు. చివరికి ఒక నిర్ణయానికొచ్చాను. నేను ఆవిడకోసం ఏవిధమైన ప్రయత్నమూ చెయ్యగూడదు. తనంతట తాను ఆవిడే ముందు బైటపడే పక్షంలో కాలదన్ననూ కూడదు. ఈ నిర్ణయాని కొచ్చినతర వాత, మనస్సు ఒకరకంగా తేలికపడ్డది. ఐతే, మరొక దిక్కు మాలిన సందేహం నన్ను బాధించకపోలేదు. ఆమె నన్నెందుకు కోరాలి? కోరుతుందని నేనెందుకు ముందుగా అపోహపడ్డాను? చలపతికంటే, నేను అందగాణ్నా నే విషయం అట్లుండగా, వాడి కంటే డబ్బులోనూ, చదువులోనూ గూడా నేను అధికుణ్నే! ఈ కారణాలవల్ల ఆవిడ ప్రేమకు నేను అర్హుణ్నికావొచ్చు. కానీ, ఆమె దృష్టిలో వీటికి విలువ లేనేలేదేమో! ఇటువంటివి ఆమె లోని ప్రణయాన్ని కదిలించలేవేమో? ఐనా ఇవన్నీ మరీ నీచపు ఆలోచనలు. ఒకానొక మిత్రుని భార్యనుగురించి ఇట్లా అనుకోవటం బొత్తిగా కూడని పని. ఇటువంటి బుద్ధులు నాకు నేను ఎన్నో చెప్పుకొన్నాను. కానీ. వీటన్నిటినీ తప్పుకొని వెధవ మనస్సు—ఆమెచుట్టూ తిరగటం మానుకోలేదు.

సాయంత్రంపూట నేనూ చలపతీ రైలుకట్టకు షికారు వొచ్చాము. వాణ్ణి నేను జాగ్రత్తగా కనిపెడుతూనేఉన్నాను. ఎక్కడా ఉత్సాహంలేదు. వాడి నిరుత్సాహానికి కారణం బహుశా భార్యకు సంబంధించినది కావొచ్చు. ఏవిషయమూ ముందుగా నిర్ధారించుకోవటం తప్ప ఇందులో నేను తొందర పడటంగూడా అనవసరమే! ఎందుకంటే, బాధపడుతున్న వ్యక్తి,

అందులో నాసహాయ మపేక్షించిన వ్యక్తి ఈక్షణాన కాకపోయినా, మరోకొద్దిసేపటికైనా, తనంతటతాను బైటపడకపోడు.

నా అంచనా గురితప్పలేదు. ఇద్దరమూ సిగ్నల్ దాటి, చాలాదూరం వొచ్చిన తరువాత చలపతే ముందుగా ప్రారంభించాడు.

'కాని, చివరికిట్లా జరుగుతుందని నే నేమాత్రమూ అనుకోలేదు. అసలు నాకీ ఆలోచనే రాలేదు' అన్నాడు చలపతి ముఖం దిగులుగా పెట్టి.

నాకేమో అగమ్యంగా వున్నది. ఏవిషయం, ఎప్పుడు చివరికెల్లా జరిగిందో నేనెట్లా ఊహించను? నా అయోమయా వస్థను చలపతి గ్రహించాడు గావును, సూటిగా నా ముఖంలోకిచూసి, బాధగా తలదించుకొన్నాడు.

'నాకు ఊళ్ళు తిరగటం యిష్టమైనప్పటికీ, మా మేనమామగారి ఊరుమాత్రం బొత్తిగా యిష్టంలేదు' అన్నాడు చలపతి. 'అప్పట్లో మామేనమామకు జబ్బుచేసింది. ఆయనకు వేరేదక్షత లేకపోవటంవల్ల, కోలుకొన్నదాకా, పొలం వ్యవహారం నేను చూడాల్సొచ్చింది. అప్పుడే నాకీ పిల్లతో పరిచయమైంది.'

'ఏపిల్లతో...?' అన్నాను.

'ఇదే! తులసితో. ఒకరోజున నేను బావిదగ్గర నీళ్ళు తోడుతున్నాను. ఆపిల్ల నీళ్ళకోసంవొచ్చి దూరంగా నిలబడ్డది. అదే మొదటిసారి ఆమెనుచూడటం. అప్పుడే నేను చలించాను. నాలో ఇన్నాళ్ళనుండీ మరుగునపడివున్న ఏవో వాసనలు జ్ఞాపకంలో మెదలసాగాయి. కొన్నిరోజులు తరుచుగా కలుసుకొ

టుండేవాళ్ళం. కానీ, అట్టే మాట్లాడుకోనేవాళ్ళంకాదు. ఆమెను చూస్తుంటే, గొప్పప్రశాంతిలోకి వెళ్ళినట్లు ఫీలయ్యేవాణ్ని. ఏదో పవిత్రభావం ఆమెపట్ల, నాలో చోటు చేసుకోసాగింది. ఆమెఅంటే నాకుగొప్ప యిష్టమూ, ప్రేమా కలిగాయి' అని నా వేపు తిరిగాడు చలపతి '. ప్రేమ-అంటే నువ్వు మరొకవిధంగా అనుకోబోకు. నా ప్రేమకు ఈ శరీరంతోటి సంబంధం లేదు. ఇంద్రియాతీతమైన. అదొక స్వచ్ఛందవాంఛ. ఆమె సుఖంకంటే నాకు కావలసిందేమీ లేదు ఆమె సంతోషంకంటే నేను కోర దగింది కూడా ఏమీలేదు. వస్తుతః ఈభగవంతునిమీద నాకు నమ్మకంలేదని నీకు తెలుసుగదా! ఆమె జీవితం అన్నివిధాలా, సౌఖ్యప్రదం చేయమని ప్రతిరోజూ భగవంతుణ్ని ప్రార్థించే వాణ్ణి' అని ఆగిపోయినాడు చలపతి.

నాగుండెలు బాదబాదలాడినాయి చివరకు తులసి జీవితం ఎట్లపరిణమించిందో! చలపతి చెబుతూ, చెబుతూ మధ్యలో ఆపటము చూస్తే, తులసికి, ఊహింపరాని ఆపత్తేమిటో సంభవించే ఉంటుందని తోస్తున్నది. చలపతి మళ్ళీ ప్రారంభిస్తాడేమో నని పదినిమిషాలు చూశాను. వాడిముఖం మరీ కుంగుకుపోయింది. బాధను బలవంతాన అణుచుకొంటున్నవాడిలా కనిపించాడు.

'ఇన్నిటికీ తులసి ఏమయింది చలపతీ? ఆమెగాని చనిపోలేదు...?' అంటున్నాను. చలపతి గట్టిగా నిట్టూర్పు విడిచాడు.

'లేదు. అట్లాగైనా బాగుండిపోను. ఒక ఏడుపేడిచి ఊరుకోవొచ్చు.అంతకంటే, దారుణమైన...' చెప్ప లేకఆగాడు.

'బహుశా...' అని నేనూ నీళ్ళు నమిలాను. ఆ తరువాత మాట ఏదైనా కావొచ్చు. మన దేశంలో ఆడవాళ్ళ జీవితాలు ధ్వంసంకావటానికి ఎన్ని మార్గాలు లేవు గనక! వాటిలో ఏవొక్కటో తులపి బ్రతుకును బద్దలుగొట్టి ఉంటుంది.

చలపతి చిన్నగుటక వేసి. తుంగ మొలకను పీకుతూ అన్నాడు.

'కానీ—ఇన్నిటికీ రోజులట్లా తీసుకొచ్చావు యనుకో. అటువంటి విషఘుడియ ఒకటి ఉంటుందని నేనెప్పుడూ అనుకోలేదురా! ఆమె, నేనూ ఎన్నోసార్లు మా మేనమామ గారింట్లో కలుసుకొంటుండే వాళ్ళమని చెప్పాను గదూ! ఒకసారి మామూలుగా కూచొని ఉన్నాము. ఆమెతండ్రి చూశాడు. ఆమెను దారుణంగా కొట్టాడు. పెద్దగొడవ జరిగింది. వాళ్ళు చాల గౌరవస్తులు. అటువంటి 'అవమానం' వాళ్ళ వంశంలో ఏనాడూ లేనేలేదట. నేను ఎంతో చెప్పాను. ఎందరి దేవుళ్ళ మీదనో ఒట్టు వేసుకొన్నాను. ఐనా వాళ్ళు నమ్మలేదు. వాళ్ళే గాదు, మా మేనమామే నమ్మలేదు. ఆ పిల్లను ఇంట్లోంచి వీధిలోకి గెంటాడు తండ్రి. నే నెవరినిగురించి ప్రతిక్షణమూ, నమ్మకంలేని దేవుణ్ని ప్రార్థించనాగానో, ఆవ్యక్తి నాకళ్ళ ఎదుటనే ఇటువంటి 'నీచస్థితి'కి రావటాన్ని నేను చూడలేకపోయినాను. చివరకు ఆమెను పెళ్ళిచేసుకోక తప్పలేదు' అని మహాపరాధిలాగున బిక్కచచ్చిపోయినాడు చలపతి.

'ఓహ్హో! అదృష్టవంతుడివంటే నువ్వేనోయ్ చలపతీ!! ఏరి, కోరి తపస్సు చేస్తున్నటువంటి, అపురూప సుందరిని భార్యగా...' మిగతామాటలు అనలేకపోయినాను. అప్పటికే

చలపతి నా వేపు చావు భయంతో చూస్తున్నాడు. వాడి భయానికి కారణం నాకు తోచలేదు. ఉన్నట్టుండి చలపతి కళ్ళు తడి చేసుకొన్నాడు.

'ఏమిటి చలపతీ?' అని బుజ్జగించాడు. వాడు కాసేపటికి తేరుకొని—

'నీకు 'ప్రేమ' అంటే ఏమిటో ఇంకా అర్థంగాలేదు. నీధోరణి చూస్తూవుంటే, నీజీవితాంతం లోగా నువ్వు దాని అర్థాన్ని తెలుసుకోలేవనే తోస్తున్నది. బహుశా నేను చెప్పబోతున్నమాటలు నీకు విచిత్రంగా ఉండొచ్చు. కానీ నాస్వానుభవంలోనించి చెబుతున్నాను. మన సాధారణ అంచనాలకు, ప్రవృత్తులకు, ఉద్దేశాలకు చాలదూరంగా ఉంటుంది నిజమైన ప్రేమ. శృంగార జీవితంలో అది దాదాపు తురీయావస్థలాంటిది. ఆమెను నేను గొప్పగా ఆరాధించాను. ప్రగాఢంగా ప్రేమించాను.' అంటున్నాడు.

'ఐతే ఇంక నువ్వు విచారించట మెందుకు? మాట పూర్తిగాకముందే చలపతి అందుకొన్నాడు.

'తెలీదు. అవును. నిజంగానే తెలీదు. ఎంతచెప్పీ, నీకు నేనది తెలియజెప్పలేదు. అదృష్టముంటే, నీఅనుభవమే దాన్ని నీకు నేర్పుతుంది. లేదా, కోట్లాది క్రిముల్లో నువ్వూ ఒకటవుతావు...సరే! పొద్దుబోయింది. ఇంటికెడదాం పద. మనకోసం తులసి కనిపెట్టుకొని ఉంటుంది. అందులో ఆమె నిద్రకు బొత్తిగా తట్టుకోలేదు

ఆ మర్నాటిఉదయం నేను లేచేసరికి చలపతి ఇంట్లో లేడు. ఏదోపనివుండి నాకంటే ముందుగానే లేచి వెళ్ళాడట.

ఒంటరిగా ఆయింట్లో కూచోబుద్ధి గాలేదు. నాలుగుబజార్లూ తిరిగి నేనింటికొచ్చేసరికి పన్నెండయింది. చలపతి అప్పటికే భోజనంచేసి వెళ్ళాడని తులసి చెప్పింది. నేనూ రెండుమెతుకులు కొరికి నడుంవాల్చాను—ఆసాయంత్రం గూడా చలపతి నాకు కనిపించలేదు. తిరిగి అతన్ని నేను చూసింది, రాత్రి పడుకో బోయ్యేముందు మాత్రమే!

నేను అడక్కముందే చలపతి ప్రారంభించాడు.

'ఒక పనికోసం ప్రొద్దుణ్నించీ నేను తిరుగుతున్నాను. అదింకా పూర్తిగాలేదు. నాఆశలన్నీ, ఆమనిషిమీద పెట్టుకొన్నాను. నాదృష్టిలో అత నాపనిని నిరభ్యంతరంగా చెయ్యగల సమర్థుడు. ఏకారణంవల్ల, అత నాపని చెయ్యలేకపోయినాడో తెలీటంలేదు.'

'ఏంపని?' అన్నాను ఉండబట్టలేక. చలపతి నా వేపు చూసి నవ్వాడు.

'ఎంత వెర్రిప్రశ్న వేశావోయ్! అది పైకి చెప్పదగ్గ దైతే, ఇందాకనే అనేవాణ్ని గదా పైకి, ఆమాత్రం ఆలోచించలేకపొయ్యావా??' ముందు నోరుమూసుకొని, తరవాత కళ్ళుగూడా మూసుకొన్నాను.

ఆమర్నాడు, ఆతరవాత రోజుగూడా, చలపతి నాకు కనిపించలేదు. ఆపనేమిటో ఇంకా పూర్తికాలేదుగావును, ఆచేసే వాడెవడో వొట్టి నాపయి ఉంటాడనిపించింది నాకు. ఇష్టమైతే చకాపికీ చేసేయ్యటమూ, లేదా, నావల్లకాదనటమూ ఐతే బాగుండునుగదా! ఇట్లా నలుపుడు బెట్టి చంపకుండా? ఏదిఏమైనా నా కవసరంలేదు గానీ, నే నాసించినంత పెద్ద ముత్తంలో—

కాలక్షేపం దొరకలేదు వాడేమో, తనపనితోనే సతమతమవు తుండే, ఇంటోచూద్దామా నేనొక్కణ్ణి, రామాలయమును, జువ్విచెట్టునూ, ఎన్నిసార్లుచూడగలుగుతాడు ఎవడైనా?ఇక పీఠం ఎత్తివేద్దామనుకొని ఒకరోజు రాత్రి కాపలాతో చలపతిని పట్టు కొని చెప్పాను. వాడు రెండుమూడు నిమిషాలు నన్ను నెమ్మ దిగా చూసి, ఐనా రేపు, ఎల్లుండిగూడా ఉండు. నువ్విప్పుడు వెళ్ళి అక్కడ చక్కబెట్టే పనులేమీలేవుగదా!' అని దులప రించుకొని వెళ్ళిపోయినాడు. వాడు గతవారంనుంచీ ఇంట్లోనే పడుకోవటంలేదని ఆతరవాత తులసి చెప్పింది. చలపతిని ఈ విధంగా నిద్రాహారాలకు దూరంచేసిన ఆ పని ఎటువంటి చిక్కు లమారిదోగదా!

ఒకరోజు ఉదయం రేజర్కోసం పెట్టె తెరిచాను. అందులో నాకు తెలీని కాగితాలేవో కనిపించాయి. తీశాను, మొదటిపేజీమీద వ్రాత నన్ను సంబోధిస్తోనే ప్రారంభమైంది.

'——! నువ్వంటే నాకు మొదటనుండీ గౌరవమున్నది. నువ్వు నాదృష్టిలో, నాకంటే అన్ని విధాలా ఉన్నతుడివి. అందుకే నా వివాహమైన తొలిరోజుల్లోనే నీకు ఉత్తరంరా శాను. నువ్వురాలేదు. అప్పటినుండీ, నేను నా అన్వేషణ ప్రారంభించాను. నువ్వు కొన్ని విషయాల్లో వొట్టి అర్భకుడివి. నీదృష్టి పరిమితమైన పరిధిలోనే తిరుగుతుంటుంది. దానికావల గూడా సుందరాలు, ఆనందాలు ఉంటయ్యని నువ్వూహింపలేక పోతున్నావు. నేను తులసిని గాఢంగా ప్రేమించాను. ఆమె ఆనందంకోసం నే నెటువంటి త్యాగానికైనా సిద్ధంగాఉన్నాను. కానీ నాత్యాగాన్ని అందుకోగల వ్యక్తి ఇంతవరకూ దొరక

లేదు. నిజమైన ప్రేమకు 'స్వపర' భేదముండదు. నిజమైన ప్రేమ; ఎదుటి వ్యక్తినుండి సౌఖ్యాన్నో, ఆనందాన్నో పొందటము కంటే, ఎదుటివ్యక్తికి శాయశక్తులా ఆనందాన్ని అందివ్వటానికే ప్రయత్నించటం జరుగుతుంది. ఆమనిషినుండి నే నెంత సుఖం గుంజుకొంటున్నాను? అనే ప్రశ్నే రాదు. ఆమనిషికి నే నెంత సుఖాన్నిస్తున్నాను? ఎంత యివ్వగలను? అనే ప్రశ్నలే ఉంటాయి. ఆమెనుండి నేను కొంతసుఖం పొందుతున్నాను. ఆ మాటకాదనటంలేదు. ఆపాటిసుఖం నాకే స్త్రీఐనా యివ్వగలుగుతుంది. అందుకోసమని తులసిని నా'స్వంతం' చేసుకోవటము నా కిష్టంలేదు. కానీ తులసికి నేనేమిస్తున్నాను? నానుండి ఆమెగూడా కొంతసుఖాన్నో, లేక సుఖంలాంటిదాన్నో పొందుతుండవొచ్చు. అది ఆమెకు సంతృప్తికరంగానే ఉండవొచ్చు. ఆమెకున్న పరిమితమైన సంస్కారం; ఆమె మనస్సుకు, తను అనుభవిస్తున్నదే సౌఖ్యమని చిచ్చుగొట్టవొచ్చు. కానీ నాకు గాదు. నేను ఇంతటితోనే ఆగిపోలేదు. ఎందుకంటే ప్రేమరాసి అల్పసంతోషి, మూర్ఖురాలూ ఐవుండగూడదు. ఆమె అనంతమైన సౌందర్యాలలోకి ఆనందములలోకి, తనను తను జేర్చుకోవాలి. అందు కామెసంస్కారం ఒప్పుకోకపోతే, నేనైనా ప్రోత్సహిస్తాను. నీకదంతా కొత్తగా ఉంటుందనుకొంటాను. కానీ చాలా ఖరీదైన సత్యమిది. ఆమెను నేను సుఖపెట్టలేదేమోననే గుడ్డినమ్మకం నన్ను వేధించసాగింది. నా ప్రణయరాణి, సాధారణ స్త్రీలాగా బ్రతకటం నాకిష్టంలేదు. అందుకనే, నా కంటే ఉన్నత వ్యక్తికోసం నేను వెతకటంగూడా. ఇప్పటికైనా నన్నునువ్వు అర్థంచేసుకోగలిగితే ధన్యుణ్ణి. నిన్ను ఎప్పుడోరమ్మని

రాశాను. ఇప్పుడొచ్చావు. నీకు ఎన్నో నిరపాయమైన అవకాశాలిచ్చాను. నువ్వు గ్రహించుకో, గ్రహించిగూడా నా ఆ అవకాశాలను వినియోగించుకో లేదు. ఈ కాగితాలు చదవడం పూర్తయిన తరువాత, నిరభ్యంతరంగా నువ్వెళ్ళి పోవొచ్చు. నీలాంటి '—'తో నాతులసి ఏమీ సౌఖ్యపడబోదని, నేను గ్రహించగలిగాను. సుస్థిరంగా నాతులసి సౌఖ్యపడగలగటానికై, తిరిగి నేను నా అన్వేణకు ప్రారంభించాను. శలవు.

చదవటం పూర్తిచేశాను. తల గ్లోబులాగా తిరిగింది. ఒకానొక కొత్తదనం మెత్తగా హృదయాన్ని తడుతున్నది. మహోన్నతమైన ప్రేమశిఖరాన్నధిరోహించిన చలపతిరూపం గంభీరంగా నాకళ్ళముందు నిలిచింది. ఏదో సరిక్రొత్త కాంతి నాలోకి ప్రవహిస్తున్నట్లు, అనుభవించాను. చేతిలోనుండి కాగితాలు క్రిందకు జారాయి.